
ఫిట్‌నెస్ 9జిమ్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులు

వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, యువత స్థానికంగా ఉన్న జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం బర్కత్‌పురలో ఫిట్‌నెస్ 9 జిమ్‌ను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. అనేక రకాల వ్యాధుల నుంచి విముక్తి లభించడానికి శారీరక వ్యాయామం తప్పనిసరి అని అన్నారు. జిమ్‌లలో అన్ని రకాల వ్యాయామ వస్తువులు అందుబాటులో ఉండడం వల్ల యువతకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతిఒక్కరూ వ్యాయామం తప్పనిసరి చేయాలని, మంచి ఆహారం తీసుకుంటే నిండా నూరేళ్లు జీవిస్తారని అన్నారు. ఫిట్‌నెస్ 9 జిమ్ ఎండీ సర్టిఫైడ్ ఫిట్‌నెస్ ట్రైనర్ రాము చిక్క మాట్లాడుతూ జిమ్‌లో అన్ని రకాల వ్యాయామ వస్తువులు అందుబాటులో ఏర్పాటు చేశామన్నారు. స్థానిక యువతకు ఉపయోగపడే విధంగా ఈ జిమ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి శ్రీధర్, డాక్టర్లు మనోజ్‌రెడ్డి, సంజు సుధా

పోలియో రహిత సమాజ స్థాపనకు కృషిచేయాలి

ముషీరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : పోలియో రహిత దేశం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషిచేయాలని హైదరాబాద్ జిల్లా హ్యూమనైజేషన్ అధికారి(డీ.ఐ.వో) డాక్టర్ పి. శ్రీధర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మిడ్‌టౌన్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ కోహినూర్ సంయుక్త ఆధ్వర్యంలో భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ పరిధిలోని రాంనగర్, ముషీరాబాద్‌లో అవగాహన ర్యాలీ, సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీధర్ మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు విధిగా చుక్కల మందు వేయించాలన్నారు. రెండు చుక్కలు.. నిండు జీవితం అనే నినాదంతో పోలియో మహ్మమారి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పోలియో నిర్మూలన కోసం రోటరీ క్లబ్‌లు, బస్తీలలో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మిడ్ టౌన్ అధ్యక్షురాలు హాజీరా, ఆదీప్, వైద్యాధికారులు డాక్టర్ ఎం. మనోజ్‌రెడ్డి, డార్టర్ సంజూ సుధా, పీహెచ్‌ఎన్ కళమ్మ, ఏఎన్‌ఎంలు రేణుక, పద్మలత, సంతోష, రోటరీ క్లబ్ ప్రతినిధులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

నల్లకుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు సరైన ప్రాధాన్యత కల్పించడం లేదని తెలంగాణ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కె.కిరణ్‌కుమార్ ఆరోపించారు. ముఖ్యంగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. దీంతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ధ్రువీకరణ పత్రాల కేటాయింపులో పలు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. శుక్రవారం హైదర్‌గూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు 8,500 కోట్ల రూపాయలను విడుదల చేయకపోవడం వల్ల చివరకు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని లేకపోతే టీడీపీ తెలుగు యువత ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ముషీరాబాద్ డీఎంగా రఘు బాధ్యతల స్వీకరణ

రాంనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ముషీరాబాద్ నూతన డీఎంగా టి. రఘు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డీఎంగా పనిచేసిన సురేందర్ బస్‌భవన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో సిద్దిపేట డిపో మేనేజర్‌గా పనిచేసిన టి.రఘు ముషీరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డిపో అధికారులు, సిబ్బంది పాత డీఎంకు వీడ్కోలు, నూతన డీఎంకు స్వాగత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన డీఎం టి.రఘు బాధ్యతలు చేపట్టి మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా డ్రైవర్లు, కండక్టర్లు పనిచేయాలని సూచించారు. డిపో ఉద్యోగులందరూ కలిసి కట్టుగా డిపో అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరూ విధులకు నిత్యం హాజరై పూర్తిస్థాయిలో బస్సులు నడిచే విధంగా పనిచేయాలని అన్నారు. ప్రయాణికులు, ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న రఘు

కలుషిత నీటి సరఫరాను నివారించాలి

బర్కత్‌పుర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ డివిజన్‌లో కలుషిత నీటి సరఫరాను తక్షణమే నివారించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. శుక్రవారం నారాయణగూడలోని జలమండలి కార్యాలయంలో జలమండలి డీజీఎం కృష్ణను కలిసి విన్నవించినట్లు ఆమె తెలిపారు. డివిజన్‌లోని భూమన్నగల్లీ, సూర్యదేవాలయం వీధిలో కొన్ని రోజులుగా నల్లాల్లో కలుషిత నీరు సరఫరా జరుగుతుండడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పైప్‌లైన్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


జలమండలి డీజీఎం కృష్ణను కలిసి విన్నవిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

కొత్త బ్రిడ్జి పూర్తయిన తర్వాతే పాతది నిర్మించాలి

అంబర్‌పేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా సమీపంలోని మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తర్వాతనే పాత బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని బీఆర్‌ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ అధికారులను కోరారు. మూసారాంబాగ్ కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాకముందే పాత బ్రిడ్జిని కూల్చి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించాలని చూస్తున్నారని ఆరోపిస్తూ సిద్ధార్థ ముదిరాజ్ ఆధ్వర్యంలో మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలకు సమాచారం ఇవ్వకుండా అధికారులు బ్రిడ్జి కూల్చే నిర్ణయం తీసుకోవడం సరైన చర్య కాదన్నారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్ ముదిరాజ్, బీజేపీ నాయకుడు యశ్వంత్ పాల్గొన్నారు.


మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద ధర్నా చేస్తున్న సిద్దార్థ ముదిరాజ్, యశ్వంత్ తదితరులు


బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఆర్‌ఎస్ నగర సీనియర్ నాయకులు వి.సుధాకర్‌గుప్తా, డి.రవియాదవ్ తదితరులు


బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ బీఆర్‌ఎస్ నగర సీనియర్ నాయకుడు కేశపురం అరుణ్


భోలక్‌పూర్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేసిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, వై. శ్రీనివాస్‌రావు, బింగి నవీన్

నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కృషి

పుట్టినరోజు వేడుకల్లో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ

రాంనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కృషిచేస్తానని బీఆర్‌ఎస్ యువజన నాయకుడు, ఎమ్మెల్యే తనయుడు ముఠా జైసింహ తెలిపారు. శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా మాజీమంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌లను కలిసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ముషీరాబాద్ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు నిర్వహించిన పుట్టినరోజు వేడుకలు, సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జైసింహ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల నాయకత్వంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేసేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నగర సీనియర్ నాయకుడు వి.సుధాకర్‌గుప్తా ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. బీఆర్‌ఎస్ నగర సీనియర్ నాయకుడు కేశపురం అరుణ్ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో వేడుకలు జరిగాయి. బీఆర్‌ఎస్ నగర సీనియర్ నాయకుడు గోక నవీన్, రాంనగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శంకర్ ముదిరాజ్, మన్నె గోవర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.


కేటీఆర్ ఆశీర్వాదం తీసుకుంటున్న ముఠా జైసింహ


బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహకు మెమెంటోను అందజేస్తున్న ఆ పార్టీ ముషీరాబాద్ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, సయ్యద్ అహ్మద్ భక్తియార్, టెంట్‌హౌస్ శ్రీనివాస్


ముషీరాబాద్ రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో బాలికలతో కలిసి సహపంక్తి భోజనం చేసిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, అక్లక్ హుస్సేన్ తదితరులు

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకావాలి

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని పేదలకు అండగా నిలవాలని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ పుట్టిన రోజును పురస్కరించుకొని బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకుడు బింగి నవీన్‌ల ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ, లేబర్ అడ్డా కార్మికులకు అల్పాహారం పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి, సయ్యద్ అహ్మద్ భక్తియార్, టెంట్‌హౌస్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ముఠా జైసింహకు శుభాకాంక్షలు తెలిపి, సన్మానించి, మెమెంటో అందజేశారు. బీఆర్‌ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు డి. శివముదిరాజ్ ఆధ్వర్యంలో మొరంబొంద ప్రాంతంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు 4 బ్లాక్‌బోర్డులు, విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం ముఠా జైసింహ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ముషీరాబాద్ రెయిన్‌బో హోం అనాథ ఆశ్రమంలో బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ సీనియర్ నాయకుడు అక్లక్ హుస్సేన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. విద్యార్థులతో కలిసి జన్మదిన కేక్‌ను ముఠా జైసింహ కట్ చేశారు.

హనుమాన్ ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

● మాజీ ఎంపీ వి.హనుమంతరావు

రాంనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బుర్జుగల్లీలోని హనుమాన్ ఆలయ పునర్నిర్మాణంలో అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. శుక్రవారం అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయం పురాతన కట్టడం తొలగింపు, పునర్నిర్మాణ పనులను వీహెచ్ ప్రారంభించి మాట్లాడారు. అంబర్‌పేట మహంకాళి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న హనుమాన్ ఆలయం పురాతనమై శిథిలావస్థకు చేరుకుందన్నారు. దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో పురాతన కట్టడం తొలగించి ఆ స్థానంలో నూతన కట్టడాన్ని చేపట్టాలని దేవస్థాన సేవా సమితి తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఈ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వ్యాపారస్తులు, ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ముఖ్య సలహాదారుడు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, చైర్మన్ పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, అధ్యక్ష, కార్యదర్శులు వై.శంకర్‌గౌడ్, బి.మల్లికార్జున్‌గౌడ్, కోశాధికారి గడ్డం శ్రీధర్ గౌడ్, కార్యదర్శి సీ.హెచ్.సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శి బి.కిషోర్, ఫైనాన్స్ కన్వీనర్ గిరిధర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ నారాయణస్వామి పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వి.హనుమంతరావు తదితరులు

దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలి

ముషీరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయిపై దాడిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1న లక్ష మందితో నిర్వహించే చలో హైదరాబాద్ దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ కోరారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని భరత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో దళితుల ఆత్మగౌరవ సభ విజయవంతానికై నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశానికి గజ్జల రాజశేఖర్ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన పోలీసులు కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. గవాయి దళితుడు అయినందు వల్లే ఆయనపై దాడి చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఆయనపై జరిగిన దాడి వల్ల దళితుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. వెంటనే నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గవాయిపై దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ వినయ్, నాయకులు శ్రీకాంత్, రోషన్, దశరత్, మధు, రమేష్, రాములు, వెంకటయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గజ్జల రాజశేఖర్ మాదిగ

నత్తనడకన రోడ్ల నిర్మాణం : కార్పొరేటర్ అమృత

నల్లకుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్‌లోని పలు చోట్ల నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుందని స్థానిక కార్పొరేటర్ యాకర అమృత పేర్కొన్నారు. డివిజన్‌లోని బ్రాహ్మణ హాస్టల్ వీధి, పాత రామాలయం, మోరంకోరి కాలనీ తదితర ప్రాంతాల్లో రూ.2.50కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రోడ్ల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేటర్ ఆయా ప్రాంతాల్లో సందర్శించి రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇటీవల వినాయకచవితి, దసరా, దీపావళి పండుగల సందర్భంగా కొంత మేరకు ఈ రోడ్ల నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొందన్నారు. అయితే ఈ పండుగలు పూర్తయిన నేపథ్యంలో ఇక ఏ మాత్రం ఉపేక్షించకుండా త్వరితగతిన రోడ్ల నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నారు. లేని పక్షంలో ఆయా కార్యాలయాల ఎదుట ప్రజలతో కలిసి ధర్నా చేపడతామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారు లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ యాకర అమృత తదితరులు

ముషీరాబాద్‌లో రెండు రోజులుగా నీటి సరఫరా బంద్

● ఇబ్బంది పడ్డ ప్రజలు

ముషీరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : కృష్ణ తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులో భాగంగా రెండు రోజులు నీటి సరఫరా జరగకపోవడంతో ముషీరాబాద్‌లోని చిలకలగూడ రిజర్వాయర్ పరిధిలో గల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగడానికి నీళ్లు లేకపోవడంతో మినరల్ వాటర్‌ను కొనుగోలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ ప్రాంతంలో తాగునీటి సరఫరా జరగడం లేదని అధికారులను కలిసి వాటర్ ట్యాంక్‌లను పంపించాలని విజ్ఞప్తి చేశారు. జలమండలి కార్యాలయం వద్ద ఉన్న పబ్లిక్ కులాయి వద్ద తాగునీటిని పట్టుకునేందుకు ప్రజలు బారులు తీరారు.


ప్రభుత్వ కులాయి వద్ద తాగునీటి కోసం బారులు తీరిన ప్రజలు

క్రెడిట్ కార్డు నుంచి రూ.1,22,100 మాయం

కొత్తపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో ఓ వ్యాపారి కుమారుడి క్రెడిట్ కార్డు నుంచి రెండు విడతల్లో రూ.1,22,100 సైబర్ మోసగాళ్లు దోచుకున్నారు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ వివరాల ప్రకారం.. మన్సూరాబాద్‌లో ఉండే ఎం.సైదాచారి వ్యాపారి. ఆయన తన కుమారుడు వినోద్‌కుమార్ క్రెడిట్ కార్డు వాడుకునే వాడు. తన ప్రమేయం లేకుండానే సదరు క్రెడిట్ కార్డు నుంచి గుర్తు తెలియని ఖాతాల్లోకి మొదట రూ.50 వేలు, తర్వాత రూ.72 వేలు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. ఈనెల 18న ఆయన సైబర్ క్రైమ్‌కి ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆయన శుక్రవారం ఎల్బీనగర్ పీఎస్‌లోనూ ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

చీకటిపై వెలుగు విజయం.. దీపావళి సందేశం

● దీపావళి వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అయోధ్య నుంచి అడిస్ అబాబా వరకు, హైదరాబాద్ నుంచి హనోయ్ వరకు దీపావళి పండుగ "చీకటిపై వెలుగు, చెడుపై మంచి విజయం" అనే సందేశాన్ని అందిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన దీపావళి వేడుకల్లో ఆయన విదేశీ విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముడి కాలపు సహకారం, ఏకతా స్ఫూర్తి ద్వారా అసాధ్యాన్ని సాధ్యంగా మార్చిన ఉదాహరణలను వివరించారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న పేదరికం, నిరక్షరాస్యత, అసమానత్వం, ఆకలి, వాతావరణ మార్పులు వంటి సమస్యలపై యువత కలసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.


విదేశీ విద్యార్థులతో కలిసి దీపావళి వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కేసీఆర్‌కు ఎంఎన్ సన్మానం

ముషీరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎంఎన్ శ్రీనివాస్‌రావు ఎర్రవల్లిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఘన విజయం సాధించేలా ఇంటింటా ప్రచారం చేస్తున్నామని ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని పేర్కొన్నారు.


కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రావు

రైలు ప్రయాణికురాలి సెల్‌ఫోన్, నగదు తస్కరణ

బర్కత్‌పుర, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణికురాలి సెల్‌ఫోన్, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సైరాబాను ఫిరోజ్‌ఖాన్ కుటుంబ సభ్యులతో కలిసి అకోలాలో బిక్కనూర్ - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. నిజామాబాద్ వద్ద ఆమె హ్యాండ్ బ్యాగ్‌ను దొంగలు తస్కరించారు. ఆ బ్యాగులో ఒక సెల్‌ఫోన్, 12వేల రూపాయల నగదు, ఆధార్ కార్డు ఉన్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఈవో ఎస్.అంజనరెడ్డి తెలిపారు. 2024 - 2025 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులైన మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంసీజే, బీసీజే, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సులలో మొదటి ప్రయత్నంలో 80శాతం పైన మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్నామని, ఇందు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 14వ తేదీ వరకు పూర్తి చేసిన దరఖాస్తులను కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9491627404 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఓయూలో కొనసాగుతున్న అధ్యాపకుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రమోషన్లలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు గత కొంత కాలంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్(ఔటా) ఆధ్వర్యంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కాలేజీ వద్ద భోజన విరామంలో ఆందోళన చేపట్టారు. ఇటీవల యూనివర్సిటీలో నిర్వహించిన సీఏఎస్ ఇంటర్వ్యూల్లో ఎన్నడూ లేని విధంగా 48 మంది అధ్యాపకులను రిజెక్టు చేయడాన్ని ఔటా తీవ్రంగా ఖండించింది. బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీతలు, ఉత్తమ పరిశోధనలు చేస్తున్న అధ్యాపకులకు సైతం ప్రమోషన్స్ ఇవ్వకుండా రిజెక్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. యూనివర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చేలా యూనివర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఓయూ అధ్యాపకులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఔటా అధ్యక్షులు ప్రొ.మనోహర్, ప్రొఫెసర్లు వెంకటదాస్ సుజాత, రాంచందర్, గంగాధర్, అపర్ణ, మాధురి తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరు మహిళలు అరెస్ట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మద్యం అమ్మకాలపై నిఘా పెట్టారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భిక్షారెడ్డి, ఎస్సైలు బాలరాజు, సంధ్య సిబ్బంది కలిసి శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బాబా శాలిన్‌నగర్‌లో మద్యం విక్రయిస్తున్న భవాని, రమణిలను అరెస్ట్ చేశారు. వారి నుంచి 33 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

గంజాయి విక్రేత అరెస్ట్..

బాలానగర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ ఎస్టీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. బాలానగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ హకీం(24)గంజాయి విక్రయిస్తున్నాడు. ఇతడి దందాపై సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్టీఎఫ్ అధికారులు నిఘా పెట్టారు. బాలానగర్‌లోని ఓ పరిశ్రమ వద్ద గంజాయి విక్రయించేందుకు వచ్చిన హకీంను అరెస్ట్ చేశారు. అతడి నుంచి 580 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.